7

సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం ׀ 6 ׀ ఫిబ్రవరి ׀ 2023



కల్యాణం.. కమనీయం

ముస్తాబాద్(సిరిసిల్ల): బందనకల్ శ్రీవాసుదేవాశ్రమంలో శ్రీరుక్మిణీ–వేణుగోపాలస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది.



'పత్తిపాక'కు సన్మానం

సిరిసిల్లటౌన్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్‌ను తెలంగాణ సారస్వత పరిషత్ సత్కరించింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/15.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ సాధారణస్థాయిలో ఉంటుంది. స్వల్ప వేగంతో ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజన్నసేవలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్



వేములవాడఅర్బన్: రాజన్నను రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సృజన, రిజిస్ట్రార్ రిక్రూట్‌మెంట్ రమాకాంత్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



సిరిసిల్లఅర్బన్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పెద్దూరులో గంద్ర రమేశ్‌రావు తల్లిదండ్రులు దివాకర్–సత్తమ్మ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. విజేత వేములవాడ జట్టుకు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ట్రోఫీ, రూ.20వేల నగదు అందజేశారు.

'రాజకీయంగా ఎదగాలి'

ముస్తాబాద్(సిరిసిల్ల): బంజారాలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య గురుబాబునాయక్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బంజారా గిరిజనులతో ఆదివారం మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, ఉపాధిహక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులతో ముందుకు సాగాలన్నారు.

633 రోజులుగా అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో వేములవాడలో గత 633 రోజులుగా నిత్యం అన్నదానం చేస్తున్నారు. పట్టణంలో జరిగే వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంపిణీ చేస్తున్నారు. మధు మహేశ్, గొంగ్ల రవికుమార్, నాగుల చంద్రశేఖర్, రఫీక్, ప్రతాప నటరాజ్ పాల్గొన్నారు.

నాట్య మయూరాలు



బిందెలపై నృత్యం చేస్తున్న కళాకారులు

వేములవాడ: మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ, ముంబై కల్చరల్ అకాడమీ సంయుక్తంగా వేములవాడలో అభినయ ఉత్సవం–2023 పేరుతో రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఆదివారం నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఏఈవో శ్రీనివాస్, డీఈ రఘునందన్, పర్యవేక్షకులు రాములు, భాను ఏజెన్సీస్ అధినేత నగుబోతు రవీందర్, మై వేములవాడ ట్రస్టు ప్రతినిధి మధు మహేశ్, ఇంటర్నేషనల్ క్లాసికల్ డ్యాన్సర్ రాధామోహన్, ముంబై– ఆంధ్రా మహాసభ కల్చరల్ జాయింట్ సెక్రెటరీ సంకు సుధాకర్ పాల్గొన్నారు.

పత్తి 'ప్రైవేట్'పాలు



ఫాజుల్‌నగర్‌లో రోడ్డుపైనే పత్తి కొనుగోలు చేస్తున్న వేములవాడ వ్యాపారి

వేములవాడరూరల్: పల్లెల్లోకి ప్రైవేట్ వ్యాపారులు వచ్చారు. పత్తి రైతుల నుంచి తక్కువ ధరకే పత్తి కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు ఇలా పల్లెల్లోకి ప్రవేశించి యథేచ్ఛగా రోడ్లపైనే కొనుగోళ్లు చేస్తుంటే.. వేములవాడలో పత్తి మార్కెట్ మాత్రం ఎలాంటి క్రయవిక్రయాలు లేక వెలవెలబోతోంది. స్థానిక వ్యాపారులు సైతం బయట కొనవద్దని.. మార్కెట్‌లోని కొని ఇక్కడి జిన్నింగ్ మిల్లులకు సరఫరా చేయాలని మార్కెట్ కమిటీ నిర్ణయించింది. అయితే ఇక్కడ మార్కెట్ కమిటీ నిర్ణయాలు అమలుకావడం లేదు. పత్తి రైతులు సైతం దళారులకు తక్కువకే విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?



- ఈ చిత్రంలో రైతులు మరమ్మతు చేసుకున్న కాలువ చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ ఎల్లంపల్లి ఉపకాలువ. ఈ ఉపకాలువ కూడా 2021లో కురిసిన వర్షాలకు తెగిపోయింది. ఈ ఉపకాలువ ద్వారా తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి శివారులోని ఆయకట్టు భూములు సాగవుతాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఈ వర్షాకాలంలో మరమ్మతు చేసుకున్నారు.



- ఈ చిత్రంలో తెగిపోయిన కాలువ చందుర్తి మండలంలోని రామన్నపేట శివారు. 2021లో కురిసిన వర్షాలకు ఎల్లంపల్లి కాలువ పూర్తిగా తెగిపోయింది. ఈ కాలువ ద్వారా చందుర్తి 450 ట్యాంక్‌లోకి చేరిన నీటితో రామన్నపేట, ఆశిరెడిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లోని ఆయకట్టు భూములు సాగు అవుతాయి. కాలువ తెగిపోవడంతో యాసంగికి నీరు అందడం లేదు. వర్షాకాలంలో కాలువ కింద పొలాలు జలమయమవుతున్నాయి.



- ఇది మల్యాల పంపుహౌస్ నుంచి రుద్రంగిలోని నాగారం చెరువు నింపే పైపులైన్. ఈ పైపులైన్ సైతం 2021లో కురిసిన వర్షాలకు తెగిపోవడంతో పైపులను తీసి ఇలా గడ్డపైన పెట్టారు. మళ్లీ పైప్‌లైన్ వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా రుద్రంగిలోని నాగారం చెరువు వెలవెలబోతోంది.

- గండ్లు పడి.. పిచ్చిమొక్కలతో నిండి
- అధ్వానంగా ఎల్లంపల్లి కాలువలు
- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఆధునీకరిస్తేనే యాసంగికి నీరు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

చందుర్తి(వేములవాడ): మెట్ట ప్రాంతమైన వేములవాడ నియోజకవర్గాన్ని ఎల్లంపల్లి కాలువల ద్వారా సస్యశ్యామలం చేయాలని నిర్మించిన కాలువలు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు గండ్లు పడ్డాయి. వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్ నుంచి చందుర్తి మండలం నర్సింగాపూర్ మీదుగా మల్యాల పంపుహౌస్‌కు, అక్కడి నుంచి బండపల్లి రిజర్వాయర్ వరకు నిర్మించిన గ్రావిటి కెనాల్‌తోపాటు కొన్ని గ్రామాల్లో పిల్ల కాలువలు దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టకుంటే యాసంగి పంటలకు సాగు నీరందించడం కష్టంగానే మారుతోందని మండలంలోని తిమ్మాపూర్, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి, మల్యాల, కట్టలింగంపేట, జోగాపూర్, మర్రిగడ్డ, బండపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలు, ఆయకట్టు వివరాలు ఇలా..
ప్రధాన కాలువల పొడవు : 27 కిలోమీటర్లు
ఉపకాలువల పొడవు : 170 కిలోమీటర్లు
ఆయకట్టు : 40 వేల ఎకరాలు

కొట్టుకుపోయిన పిల్లకాలువలు

పిల్లకాలువల్లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో భారీ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండి కాలువలు కొట్టుకుపోయాయి. కాలువల్లోని నీళ్లు చేలలో నుంచి పారి పంటలు దెబ్బతిన్నాయి. కొందరు రైతులు తమ పొలాల్లో నీరు చేరకుండా వారి పరిధిలోని కాలువకు మరమ్మతులు చేయించుకున్నారు. మండలంలో ప్రధాన కాలువ సుమారు 27 కిలోమీటర్ల ఉండగా, పిల్లకాలువలు 170 కిలోమీటర్ల వరకు ఉంటాయి.

పిచ్చిమొక్కలు తొలగించాలి



పిల్లకాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి నీరు ప్రవహించక కాలువలకు గండ్లు పడ్డాయి. గండ్లు పడ్డ కాలువలకు మరమ్మతులు చేయించాలి. కాలువలో పిచ్చి మొక్కలన్నింటినీ తొలగించి శుభ్రం చేస్తేనే పొలాలకు నీరందే అవకాశం ఉంటుంది. లేకుంటే కాలువ చివరి రైతులకు నీరు అందే అవకాశముండదు.

– జగిత్యాల రాజు, రైతు, నర్సింగాపూర్

టెండర్లు నిర్వహిస్తాం



భారీ వర్షాలతో అక్కడక్కడ కాలువలు కూలిపోయాయి. పైపులైన్లు కొట్టుకుపోయాయి. వాటన్నింటినీ పరిశీలించాం. మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సాధ్యమైనంత తొందరలోనే టెండర్లు నిర్వహిస్తాం.

– సంతు ప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్టు

మరమ్మతులు చేస్తేనే యాసంగికి నీరు

మండలంలోని మల్యాల పంపుహౌస్ నుంచి బండపల్లి రిజర్వాయర్ వచ్చే గ్రావిటీ కెనాల్ వరదకు చాలా చోట్ల దెబ్బతిని, కొట్టుకుపోయి, మట్టితో నిండిపోయింది. మట్టిని తొలగిస్తేనే నీరు బండపల్లి రిజర్వాయర్‌కు చేరుతుందని రైతులు పేర్కొంటున్నారు. నర్సింగాపూర్ నుంచి చందుర్తి వరకు గ్రావిటీ కెనాల్‌లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కాలువలకు భారీ గండ్లు పడి రెండేళ్లు గడుస్తుండగా, తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధ్వానంగా మారిన కాలువలకు మరమ్మతులు చేపట్టి పంటలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

కల్యాణం.. రమణీయం



కల్యాణంలో పాల్గొన్న ఆలయ నిర్మాణదాత, సర్పంచ్, జెడ్పీ చైర్‌పర్సన్

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగులలో శ్రీగోవిందరాజులస్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా సాగింది. ఆలయ నిర్మాణదాత, శాశ్వత కల్యాణ దాత ఉప్పుగంటి శోభలత–గోవిందరావు దంపతులు, సర్పంచ్ లింగంపల్లి కరుణాకర్, ఆలయ కమిటీ సభ్యుడు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తీసుకొచ్చారు. కల్యాణం తిలకించేందుకు మండలంలోని లింగంపేట, మల్యాల, కట్టలింగంపేట, కిష్టంపేట, జోగాపూర్, మర్రిగడ్డ, చందుర్తి, బండపల్లి, రామరావుపల్లి గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, లోక బాపురెడ్డి, బైరగోని లావణ్య, పొన్నాల శ్రీనివాస్‌రావు, తిప్పని శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగం కుమార్, అల్లాడి రమేశ్, చింతపంటి రామస్వామి, సర్పంచ్ లింగంపల్లి కరుణాకర్ స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈత పోటీలలో సత్తాచాటిన జిల్లా వాసి



బహుమతి అందుకుంటున్న శ్రీనివాసాచారి

సిరిసిల్లఅర్బన్: జాతీయ స్థాయి ఈతపోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన చొప్పదండి శ్రీనివాసాచారి సత్తా చాటాడు. మాస్టర్స్‌గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి ఈతపోటీలలో జిల్లాకు చెందిన శ్రీనివాసాచారి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాడు. ఫ్రీస్టైల్ 50 మీటర్లు, బ్యాక్‌స్ట్రోక్ 50, 100 మీటర్లలో ప్రథమ స్థానంలో నిలిచి, మూడు స్వర్ణ పతకాలు సాధించాడు.

బాబోయ్ చిరుత

- పదిహేను రోజుల్లో రెండు దూడలు హతం
- భయాందోళనలో ప్రజలు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలవాసులను చిరుత భయం వీడడం లేదు. వరుస సంఘటనలతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. దూడలపై వరుసగా చిరుత చేస్తున్న దాడులతో పశువుల కాపరులు అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు వెనకాడుతున్నారు.

వరుస దాడులు..

పదిహేను రోజుల్లో చిరుత రెండు దూడలపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత నెల 21న జవారిపేటలో, ఈనెల 4న అనంతారం గ్రామంలోని ఆకుల లచ్చయ్యకు చెందిన దూడను చంపేసింది. చిరుత మండలంలో పదేళ్లుగా సంచరిస్తోంది. వందలాది పశువులు చిరుతదాడిలో చనిపోయాయి. ఏడాదిగా మండలంలోని వెల్జిపూర్, ఓబులాపూర్, వల్లంపట్ల, అనంతారం, పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లి, తిప్పాపూర్, జవారిపేటల్లో సుమారు 25 పశువులపై దాడిచేసి చంపింది. చిరుత దాడి చేసినప్పుడే ఫారెస్టు అధికారులు వచ్చి.. ఆనవాళ్లు గుర్తించి వెళ్తున్నారు. మరుసటి రోజు కనీసం పరిస్థితిపై ఆరా తీసేందుకు కూడా రావడం లేదని విమర్శలు వస్తున్నాయి. చిరుతను బంధించడంలో ఫారెస్ట్ అధికారులు సఫలం కావడం లేదు.



చిరుత పాదముద్రలు

కెమెరాలకు చిక్కని చిరుత

గతేడాది క్రితం అనంతారంలో చిరుత ఆనవాళ్లు గుర్తించేందుకు ఫారెస్టు అధికారులు నాలుగైదు చోట్ల కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏ కెమెరాలో కూడా చిరుత ఆనవాళ్లు లేవు. దాడి చేసిన ప్రాంతంలోనే ఉండకుండా.. మరో ప్రాంతానికి వెంటనే వెళ్లిపోతోందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

చిరుత కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్ ప్రాంతం నుంచి ఇల్లంతకుంట వరకు సంచరిస్తుంటుంది. ఏడాది కాలంగా చిరుత ఆనవాళ్లను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడ కూడా చిరుత కనిపించ లేదు. రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రైతులు సమూహంగా వెళ్తే బాగుంటుంది.

– భూలక్ష్మి, ఫారెస్టు సెక్షన్ అధికారి







రాజన్నకు భక్తుల తాకిడి

వేములవాడ: రాజన్నను ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం, జాతరగ్రౌండ్ రద్దీగా మారాయి. కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. అద్దాల మంటపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించి సత్కరించారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం కల్పించాలి

- న్యాయ సంరక్షణకు అందరూ కృషిచేయాలి
- జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్
- పెండింగ్ కేసులు పరిష్కారానికి అందరూ సహకరించాలి
- 1013 కేసులు నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు..
- జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్



మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం: న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించే దిశగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. ధర్మారం మండలం నందిమేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆదివారం ప్రారంభించారు. ముందుగా వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, కలెక్టర్ సంగీత, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.సురేశ్ బాబు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. పండితులు వేదమంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఆహ్వానించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కోర్టును ప్రారంభించిన న్యాయమూర్తులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కోర్టుల సంఖ్య పెంచేందుకు కృషిచేస్తామని, కోర్టుల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. తనకు తెలుగు భాష అంటే మక్కువని, చిన్నతనంలో నందమూరి తారకరామారావు ప్రసంగం వినేవాడినని, అదే సమయంలో ఆయన హిందీ భాష తీరును చూసి ఆశ్చర్యపోయేవాడినని గుర్తు చేశారు. కోర్టుల్లో వాడే భాష స్థానిక ప్రజలకు అర్థమయ్యేలా ఉంటే మరింత చేరువగా న్యాయ వ్యవస్థ పని చేస్తుందని అభిప్రాయపడ్డారు. భాష కేవలం ఇతరులకు కమ్యూనికేట్ చేసే సాధనం మాత్రమేనని, దీనికి సంబంధించి గౌహతిలో జూనియర్ సెలక్షన్ కమిటీలో జరిగిన సంఘటనను వివరించారు. మంచి పరిజ్ఞానం ఉన్న జడ్జిలను తాను ఎంపిక చేశానని తెలిపారు. మారుమూల గ్రామమైన నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గర్వకారణమని, దీనివల్ల ప్రజలకు చేరువలోనే న్యాయం అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైకోర్టు జస్టిస్ పి.నవీన్‌రావుపై ఉన్న గౌరవంతో 14మంది హైకోర్టు జడ్జిలు వచ్చి ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించడం మరింత శోభ సంతరించుకుందని అన్నారు. జిల్లాలో రెండో శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపాలు, ఓదెల మల్లికార్జునస్వామి, కమాన్‌పూర్‌లో శ్రీఆదివరాహస్వామి ఆలయం, రామగిరి ఖిల్లా వంటి ప్రాంతాలు ఉన్నాయని గుర్తు చేశారు.

16,465 కేసులు పెండింగ్..

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తి భూయాన్ తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి వసతులు కల్పించడంతోపాటు నూతన కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సహకరించాలని కోరారు. నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని త్వరగా పూర్తిచేసేందుకు సహకరించిన కలెక్టర్, అధికార యంత్రానికి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, జడ్జిలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ సెక్రటరీ భాస్కర్, ప్రజాప్రతినిధులు, న్యాయ అధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జడ్జిల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులోని నందిమేడారం అండర్ టన్నెల్‌ను సందర్శించారు.

ప్రతిఒక్కరూ సహకరించాలి...



నా సొంత గ్రామంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చాలా సంతోషంగా ఉంది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఒక్కో కేసు 20 నుంచి 30 ఏళ్లపాటు సాగడం ద్వారా ఎవరికీ న్యాయం జరగదు. ప్రతి వెయ్యి కేసులకు ఒక్క కోర్టు ఉంటే బాగుంటుంది.

– హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్‌రావు

గృహ ప్రవేశానికి వచ్చినట్లుంది



నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధికి 281 సివిల్ కేసులు, 732 క్రిమినల్ కేసులు మొత్తం 1013 కేసులు బదిలీ చేశాం. గ్రామస్థాయిలో కోర్టుల ఏర్పాటుతో ప్రజలకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంది. కోర్టు ప్రారంభానికి కాకుండా మా ఇంటి గృహప్రవేశానికి వచ్చినట్లు ఉంది.

– ఎన్వీ.శ్రవణ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి

క్లుప్తంగా

రాజన్నను దర్శించుకున్న నిజామాబాద్ కలెక్టర్



ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని ఆదివారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం అందజేశారు.

శ్రీసీతారాముల ఆలయంలో వీహెచ్ పూజలు



పూజలు చేస్తున్న వీహెచ్

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రామోజీపేట శ్రీసీతారాముల ఆలయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు ఆదివారం దర్శించుకున్నారు. వేదపండితులు సీతారామశర్మ తీర్థప్రసాదాలు అందించారు.

కల్యాణం.. కమనీయం



మర్రిగడ్డలో మల్లికార్జునస్వామి కల్యాణం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మర్రిగడ్డలో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం కనులపండువగా సాగింది. ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అనంతరం భక్తులకు మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు, సర్పంచ్ నేతికుంట జలపతి పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిలో కోతుల పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలో కోతుల బెడద నివారణకు సర్పంచ్ బూర్గుల నందయ్య చర్యలు చేపట్టారు. ఆదివారం కోతులు పట్టే బృందాన్ని రప్పించారు. గోదావరిఖనికి చెందిన శ్రీహరి బృందం గ్రామానికి వచ్చి 49 కోతులను పట్టుకున్నారు. కాగా పట్టుకున్న కోతులను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తే వారు అడవిలో కోతులను విడిచిపెడతారని సర్పంచ్ నందయ్య వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన భాగోతం బుజ్జమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతరకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. 108 వాహనానికి సమాచారం అందించగా, ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.



బోనాలతో ఆలయంలోకి వెళ్తున్న కళాకారులు



నెత్తిన బోనాలతో ..



నృత్యం చేస్తూ..

బోనమెత్తిన కళాకారులు

- వేములవాడ వీధుల్లో కళాప్రదర్శనలు
- బద్దిపోచమ్మకు మొక్కులు

వేములవాడ/వేములవాడఅర్బన్: తమను ప్రపంచానికి పరిచయం చేసిన గూగుల్‌ను తల్లిగా భావిస్తూ గూగుల్ తల్లి బోనాల పేరుతో ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్స్ (ఐటీఎఫ్) కళాకారులు బోనాలతో సందడి చేశారు. వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా యూట్యూబ్ కళాకారులు నెత్తిన బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించి బద్దిపోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని అమర వీరుల స్తూపం నుంచి డప్పుల చప్పుళ్లతో సాగిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ కళాకారులు తేలు విజయ, స్వర్ణ, మధుప్రియ, మౌనికయాదవ్, మాట్ల తిరుపతి, జీఎల్ నాందేవ్, మామిడి మౌనిక, శిరీష, వడ్లకొండ అనిల్, మల్లిక్‌తేజ, బుర్ర నటరాజ్, మారం ప్రవీణ్, గ్రామీణ కళాకారులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు. కళాకారుల విన్యాసాలను స్థానికులు, భక్తులు ఆసక్తిగా తిలకించారు.

వేములవాడలోని మహారాజ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇండస్ట్రీ తెలంగాణ ఫోక్ ఆధ్వర్యంలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

'ప్రతిభ' చూపింది.. సర్కారు కొలువు కొట్టింది



తండ్రితో ప్రతిభ



ప్రతిభను సన్మానం చేస్తున్న దుమాల గ్రామస్తులు

- తండ్రి కల నెరవేర్చిన కూతురు ప్రతిభ
- ఉద్యోగం చూడకుండానే కరోనాతో కన్నుమూసిన తండ్రి
- గ్రూప్–బీ ఉద్యోగానికి ఎంపికైన యువతి
- దూమల గ్రామస్తుల హర్షం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తన కూతురు ప్రభుత్వ కొలువు సాధించాలని తపనతో ఆ కన్నతండ్రి ఎన్నో కష్టాలు పడ్డాడు. కూలీ పనులు చేస్తూనే కూతురిని చదివించాడు. తన బిడ్డను ఉన్నతస్థాయిలో చూడాలన్న ఆ తండ్రి కల నెరవేర్చింది ప్రతిభ. కానీ తాను కన్నకలను చూడకుండానే ఆ తండ్రి కరోనాతో కన్ను మూశాడు. అయినప్పటికీ పట్టువీడకుండా అనుకున్న లక్ష్యం సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది ప్రతిభ.

లక్ష్యం వైపు అడుగులు..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకప్పటి కల్లోలపల్లె దూమాల గ్రామానికి చెందిన రాజం కృష్ణయ్య–సత్యవ్వ దంపతులకు ముగ్గురు సంతానం. కొడుకు ప్రశాంత్, కూతుర్లు పవిత్ర, ప్రతిభ ఉన్నారు. ఇందులో చిన్న కూతురు ప్రతిభ చిన్నతనం నుంచే చదువులో ముందుండేది. ప్రస్తుతం తండ్రి కల నెరవేర్చాలని లక్ష్యంతో కష్టపడి చదివి ఎస్సెస్సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్) గ్రూప్–బీ కొలువు సాధించింది. ప్రతిభ దూమాలలోని ప్రభుత్వపాఠశాలలో 2012 పదోతరగతిలో 9.7 జీపీఏ సాధించి నూజివీడులో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. 2018లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. క్యాంపస్ సెలక్షన్‌లో రాబర్ట్ బోస్ కంపెనీ బెంగుళూరులో ఉద్యోగం సాధించిది. స్వగ్రామానికి వచ్చిన ప్రతిసారి తండ్రి గోపాలకృష్ణయ్య తల్లి నువ్వు సర్కారు కొలువు సాధిస్తే చూడాలని ఉంది రా ! అంటూ కూతురుతో ఎప్పుడూ చెబుతుండేవాడు. తండ్రి కలను నెరవేర్చాలని తపనతో ఎప్పుడూ పోటీపరీక్షలకు సిద్ధమవుతూ పరీక్షలు రాస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే 2019లో ఎస్సెస్సీకి దరఖాస్తు చేసి కేంద్రప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ప్రయత్నిస్తుండగా గోపాలకృష్ణయ్య 2020లో కరోనాతో మృతి చెందాడు. తన బిడ్డను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్న తన కల తీరకముందు తనువు చాలించినా సంఘటన ప్రతిభపై ప్రభావం చూపింది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో తండ్రి తనకు గుర్తుచేసిన లక్ష్యాన్ని పూర్తిచేయాలనే పట్టుదలతో టైర్ వన్, టైర్ టు, టైర్ త్రీ కంప్యూటర్ టెస్ట్ అన్నింటిలో అర్హత సాధించింది. కంబైన్డ్ గ్రాడ్యూయేషన్ లెవెల్ ఎగ్జామినేషన్ 2020లో ఆల్‌ఇండియా 14,13 ర్యాంకుతో మొదటి ప్రయత్నంలోనే సీజీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా గ్రూపు–బీ ఉద్యోగం సాధించింది. శిక్షణ పూర్తిచేసుకున్న ప్రతిభ బెంగుళూరులో గత సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టింది.

నాన్న కల నెరవేరింది..

నాన్న కూలిపనులు చేస్తూ ఉన్నత చదువులు చదివించాడు. నాన్నకల నెరవేర్చే నాటికి ఆయన మృతిచెందడం ఆవేదనకు గురిచేసింది. కన్నతల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి ఈ తరం యువత కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అలవోకగా చేరుకోవడం సాధ్యమవుతుంది. అందివచ్చినా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. – ప్రతిభ ,సీజీఎస్టీ ఇన్‌స్పెక్టర్

ప్రతిభకు సన్మానాలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రాజ్యం ప్రతిభను దూమాల గ్రామస్తులతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు ఇతరులు ఘనంగా సన్మానిస్తున్నారు. పట్టుదలతో చదివి మారుమూల పల్లె నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ప్రతిభ పట్టుదలను అందరూ మెచ్చుకుంటున్నారు. నేటితరం యువత ప్రతిభను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొంటున్నారు.

కరెంటు స్తంభం విరిగిపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

- భూమి చదును చేస్తుండగా ఘటన
- పరిహారం కోసం ట్రాక్టర్ యజమాని ఇంటివద్ద మృతదేహంతో ఆందోళన



సంతోష్ (ఫైల్)



ట్రాక్టర్‌పై సంతోష్ మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ధర్మారంరోడ్ (తెనుగువాడ)లో భూమిని ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి అది విరిగిపడడంతో ట్రాక్టర్ నడుపుతున్న చిటవేన సంతోష్ (32) అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి శివారుగ్రామం బందంపల్లికి చెందిన చిటవేన సంతోష్ ఏడాది కాలంగా పెద్దపల్లిలోని తెనుగువాడకు చెందిన బూతగడ్డ సారయ్య ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అదే వాడకు చెందిన నక్క రమేశ్, నక్క శ్రీనివాస్‌కు చెందిన భూమిని చదును చేస్తుండగా వృథాగ ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో ఆ పోల్ విరిగి డ్రైవర్‌పైనే పడింది. తీవ్రరక్తస్రావం కావడంతో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, పిల్లలు మణిదీప్, సహస్ర ఉన్నారు.

పరిహారం కోసం ఆందోళన

రాత్రి సమయంలో పనులు చేయించి ప్రాణాలు పోయేందుకు కారణమయ్యారంటూ మృతుడు సంతోష్ బంధువులు పెద్దసంఖ్యలో ట్రాక్టర్ యజమాని సారయ్య ఇంటికి చేరుకుని వాగ్వాదానికి దిగారు. సంతోష్ మరణంతో అతడి కుటుంబానికి ఏ దిక్కు లేకుండా పోయిందని పరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. తాను ఏమీ ఇవ్వలేనంటూ ఇంటికి తాళం వేసి సారయ్య వెళ్లిపోవడంతో సంతోష్ మృతదేహాన్ని సారయ్య ఇంటిముందు ఉంచి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ ప్రదీప్‌కుమార్, బసంత్‌నగర్, సుల్తానాబాద్, పెద్దపల్లి ఎస్‌ఐలు శ్రీనివాస్, ఉపేందర్, రాజేశ్ తమ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాపం చిన్నారులు



సంతోష్ కొడుకు, కూతురు

ప్రమాదంలో కన్నుమూసిన సంతోష్‌కు ఏమైందో తెలియని అమాయకస్థితిలో ఉన్న చిన్నారులను చూసి స్థానికుల గుండె బరువెక్కింది. అభంశుభం తెలియని చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే కుటుంబ యజమాని లేకపోవడంతో వారికి దిక్కెవరని రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. బందంపల్లికి చెందిన చిటవేన సంతోష్‌ది పేద కుటుంబం. సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా, భార్య రజిత వ్యవసాయ కూలీగా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు భూ యజమాని, ట్రాక్టర్ యజమానులతో పరిహారం ఇప్పించేలా ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు కాలువలో పడి ఒకరి మృతి



రిజ్వాన్ మృతదేహం



కాలువలో బోల్తాపడ్డ కారు

- మరో నలుగురికి గాయాలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైమ్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ రామాలయం వెనకాల గల ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. పట్టణంలోని తులసినగర్ ప్రాంతంలో నివాసం ఉండే రిజ్వాన్(35), మరో నలుగురు స్నేహితులు కలిసి పని నిమిత్తం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం కారులో వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ధరూర్ క్యాంపు సమీప ఎస్సారెస్పీ కాలువ వద్దకు రాగానే కారు అదుపు తప్పి అందులో పడిపోయింది. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారిని బయటకు తీశారు. ఆ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లాక రిజ్వాన్ మృతిచెందాడు. మిగిలిన నలుగురికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అరవింద్ మృతదేహం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి వీర్లపల్లి మూలమలుపు సింగరేణి చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ అద్దె బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దాట్ల అరవింద్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాలు.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన అరవింద్ గోదావరిఖని విద్యానగర్‌లో బంధువుల ఇంట్లో నివాసం ఉంటూ సింగరేణి టూ ఇంక్‌లైన్ మైన్‌లో అప్రెంటిస్ ట్రైనింగ్ చేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వైపు వెళ్తుండగా, ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

- అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన కారు
- ఒకరికి గాయాలు.. ఐదుగురు క్షేమం



అదుపుతప్పిన కారు

మానకొండూర్: ఓ శుభ కార్యం నిమిత్తం కోరుట్ల నుంచి వరంగల్‌కు కారులో వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లగా తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా, ఐదుగురు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటన మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల వివరాలు.. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఓ కుటుంబం కారులో వరంగల్‌లో జరిగే ఓ శుభకార్యానికి ఆదివారం ఉదయం బయలు దేరింది. మానకొండూర్ మండలం చెంజర్ల శివారులోకి చేరుకోగానే వరంగల్ నుంచి కరీంనగర్ వైపు ఓ వాహనాన్నీ ఓవర్‌టేక్ చేస్తు కారుపైకి రాబోతున్న ఆర్టీసీ బస్సును చూసిన డ్రైవర్ వెంటనే బస్సును తప్పించే క్రమంలో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఆరుగురు వ్యక్తులు ఉండగా, భాగ్యలక్ష్మి (45) అనే మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కారులో ఉన్న మిగతా కుటుంబ సభ్యులకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ప్లాట్లుగా మారుతున్న పొలాలు

- లేఅవుట్ లేకుండానే విక్రయాలు !
- పచ్చని పొలాల్లో రియల్ ఎస్టేట్
- పంచాయతీకి ఆర్థిక నష్టం





కొలనూర్‌లో ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూమి

కోనరావుపేట(వేములవాడ): పచ్చని పొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. లేఅవుట్ లేకుండానే ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా పంట పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

జోరుగా విక్రయాలు

కోనరావుపేట మండలకేంద్రంతోపాటు కొలనూర్, సుద్దాల, నిమ్మపల్లి గ్రామాల్లో ఇటీవల ఇళ్ల నిర్మాణాల కోసం స్థల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల శివారులోని సర్వే నంబర్లు 704/ఏ, 29/సీ, 39/ఏ, 269/డీ, 472/ఈ, 671/డీ, 702/సీ, 732 నంబర్‌లలోని పంట పొలాలను కొనుగోలు చేస్తూ పొలాలను దున్నేసి మట్టిని పోస్తున్నారు. తర్వాత చదును చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇదే భూమి నుంచి మలక్పేట రిజర్వాయర్‌కు సంబంధించిన సొరంగమార్గం వెళ్తుంది. కింద సొరంగమార్గం ఉండగా పైన ఉన్న భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నోటీసులు జారీచేసినా ఆగని విక్రయాలు

గ్రామాల్లో లేఅవుట్ లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నారని ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విక్రయిస్తున్న ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్లాట్లలో పాతిన ఖనీలను పంచాయతీ ఆధ్వర్యంలో తొలగిస్తున్నా మళ్లీ పాతుతున్నారు. నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ అయినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకోవడంలో జాప్యం



పచ్చని పొలాల్లో మట్టిని పోసి వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్లాట్ల విక్రయాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పాలకులు ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదు. న్యాయపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– తూడి దేవేందర్‌రావు, కొలనూర్

కూలగొట్టాలని ఆదేశాలు జారీ చేశాం



గ్రామాల్లో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు అనుమతులు లేవు. కొలనూర్‌లోని ప్లాట్ల విషయంలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. విచారణలో అనుమతులు లేవని తేలింది. నిర్మాణాలను కూలగొట్టాలని సర్పంచ్, కార్యదర్శికి 15 రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశాం. వాటిని రిజిస్ట్రేషన్లు చేయొద్దని తహశీల్దార్‌ను కోరాం. అనుమతి లేని ప్లాట్లు కొనుగోలు చేస్తే సమస్యలు తలెత్తుతాయి.

– రాజు, మండల పంచాయతీ అధికారి



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద మొక్కులు

పోటెత్తిన కొత్తగట్టు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి పౌర్ణమి జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపైకి వాహనాలను అనుమతించకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మీదుగా గుట్టపైకి చేరేందుకు టికెట్‌లు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ జనార్దన్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మలహాల్‌రావు, ఈవో సుధాకర్, సర్పంచ్ కిషన్‌రావు, ధర్మకర్తలు, అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు